
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

బుధవారం 17 జనవరి 2024

ఇంటింటా సంక్రాంతి సంబరాలు



ఇళ్ల ఎదుట ముగ్గులు వేస్తున్న మహిళలు

సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి, మకర సంక్రాంతి, మంగళవారం కనుమను జిల్లా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. లోగిళ్లలో రంగవల్లులు శోభనిచ్చాయి. గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పతంగులతో చిన్నాపెద్దా సందడి చేశారు.

8



ఆగిన మరమగ్గాలు

- స్తంభించిన వస్త్ర పరిశ్రమ
- కార్మికుల పస్తులు
- పాలిస్టర్ బట్ట గిరాకీ లేక నిరవధిక బంద్
- 35 వేల మరమగ్గాలపై నిలిచిన ఉత్పత్తి
- జిల్లాలో రూ.60 కోట్ల విలువైన నిల్వలు
- టెక్స్‌టైల్ పార్కులో ప్రారంభమైన పరిశ్రమలు
- స్పందించిన చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్లలో వస్త్రోత్పత్తి స్థంభించి పోయింది. ప్రభుత్వ ఆర్డర్లు లేకపోవడం, యజమానులు పాలిస్టర్ వైపు దృష్టిసారించడం, దేశంలో వస్త్రోత్పత్తి రంగంలోని మాంద్యంతో పాలిస్టర్ బట్ట ధర పడిపోవడం వంటి పరిణామాలతో సిరిసిల్లలోని మరమగ్గాల పరిశ్రమపై ప్రభావం పడింది. ప్రస్తుతం బట్ట అమ్మితే నష్టాలు వస్తాయని, సిరిసిల్ల పాలిస్టర్ క్లాత్ మాన్యుఫాక్చరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యజమానులు సోమవారం నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో సిరిసిల్లలోని 35 వేల మరమగ్గాలపై ఉత్పత్తులు నిలిచిపోయాయి. పరిశ్రమపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆధారపడిన 20 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు, ఆర్వీఎం, ఇతర ప్రభుత్వ సంస్థల ఆర్డర్లు రావడంతో పరిశ్రమ సాఫీగా సాగింది. కొత్త ప్రభుత్వం నుంచి ఆర్డర్లు సకాలంలో రాకపోవడంతో పాలిస్టర్ బట్టఉత్పత్తి ప్రారంభించినా ఆశాజనకంగా లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో పరిశ్రమను కొనసాగించలేమని మరమగ్గాలపై ఉత్పత్తిని నిలిపివేశారు. వారం రోజులపాటు సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో కూడా పాలిస్టర్ బట్ట గిరాకీ లేక పరిశ్రమను మూసివేయగా ఆర్వీఎం ఆర్డర్లు ఇవ్వడానికి నిర్ణయించడంతో మంగళవారం నుంచి యథావిధిగా ఉత్పత్తులను ప్రారంభించారు. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ నిరవధిక సమ్మెపై అయోమయం కొనసాగుతోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలపై రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో వస్త్రోత్పత్తిదారులు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలవనున్నారు. ఇందుకోసం సమస్యపై చర్చించేందుకు బుధవారం సమావేశం కానున్నట్లు తెలిసింది.

● వస్త్రోత్పత్తి రంగంలో రూ.60కోట్ల విలువైన బట్ట నిల్వలు

సిరిసిల్ల మరమగ్గాలపై ఉత్పత్తి అయిన పాలిస్టర్ బట్ట నిల్వల విలువ రూ.60 కోట్ల వరకు ఉన్నట్లుగా యజమానులు తెలిపారు. సిరిసిల్లలో రూ.35 కోట్ల వరకు, టెక్స్‌టైల్ పార్కులో రూ.25కోట్ల వరకు నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం బట్టను అమ్ముకుంటే మీటరుకు రూ.2 వరకు నష్టం వాటిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

● ప్రభుత్వ ఆర్డర్లకు మంత్రి ఆదేశం

పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ మాంద్యం కారణంగా సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమ మూసివేయడంతో అధికారులు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ప్రభుత్వం ద్వారా ఆర్వీఎం బట్ట ఉత్పత్తి ఆర్డర్లను మ్యాక్స్, ఎస్ఎస్ఐ యూనిట్లకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు ఇతర సమస్యలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను ఇవ్వాలని చేనేత జౌళి శాఖ రాష్ట్ర డైరెక్టర్ అలుగు వర్షిణి ఆదేశించారు.

● ప్రభుత్వం అండగా నిలవాలి : మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలవాలని, గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూనే మరికొన్ని కార్యక్రమాలను చేపట్టాలని మాజీ మంత్రి కే తారకరామారావు ట్విట్టర్ ద్వారా కోరారు. గత ప్రభుత్వం అందించిన సహకారంతో పవర్‌లూం పరిశ్రమ అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వస్త్ర పరిశ్రమకు అండగా నిలవాలని పేర్కొన్నారు. స్పందించకపోతే పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళ్తుందని తెలిపారు. ప్రభుత్వ సహకారం ఉంటే తమిళనాడులోని తిర్పూర్ వస్త్ర పరిశ్రమతో సమానంగా పోటీ పడుతుందన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



కృతజ్ఞతా ర్యాలీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, జనవరి 16: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం సనుగుల, దేవునితండా గ్రామాల్లో మంగళవారం కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటిసారి సనుగులకు వచ్చిన ఆది శ్రీనివాస్‌కు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి గొప్ప విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మొదటగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తెచ్చామన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు అమలు చేశామన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అన్ని ప్రాంతాల వారికి సమన్యాయం చేస్తామన్నారు. ఇటీవల మృతి చెందిన దేవుని తండా సర్పంచ్ భూక్య పంతులు నాయక్, గంగాధర రామస్వామి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు భీమరాజు కనకరాజు, ముస్కు ముకుంద రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవ చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

వేములవాడ, జనవరి 16 : దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు వ్యాపారులు నిస్వార్థంగా సేవ చేయాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేసి వారి ఎదుగుదలకు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేముల వాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని త్రినేత్ర ఫంక్షన్ హాల్లో కాటన్ ట్రేడర్స్ అసోసియేషన్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఆత్మీయ సన్మానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడడానికి వ్యాపారులు తమ వంతు సహకారం అం దించాలని, రైతును రాజుగా చేసే మహాకార్యంలో వ్యాపారులదే ముఖ్య పాత్రన్నారు. వ్యాపారులకు ఇబ్బందులు ఉంటే వాటిని తొలగించడానికి ప్రభుత్వ పక్షాన కృషి చేస్తానని స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించినప్పుడే వారి అభివృద్ధికి మనం తోడ్పాటు అందించిన వాళ్లం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫర్టిలైజర్, సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తూం లక్ష్మీకాంతారావు, చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతలకోట రవి, కోశాధికారి ధైత కుమార్, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, సంఘ స్వామి, పుల్కం రాజు, పులి రాంబాబు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలపై ఎస్పీకి ఫిర్యాదు

సిరిసిల్ల క్రైం, జనవరి 16: కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలపై ఎస్పీ అఖిల్ మహాజన్‌కు కాంగ్రెస్ సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ మంగళవారం ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్ కుట్ర చేస్తోందని ఎంపీ బండి సంజయ్ నిరాధారమైన వ్యాఖ్యలు చేశారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు నాగుల సత్యానారాయణగౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, మహిళా కాంగ్రెస్ టౌన్ అధ్యక్షురాలు వెలుముల స్వరూపరెడ్డి, కాంగ్రెస్ టౌన్ ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ పాల్గొన్నారు.

పల్లెలకు జీవం పోసింది సర్పంచులే



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పల్లె ప్రగతికి ప్రాణం పోసింది కేసీఆర్ అయితే పల్లెలకు సరికొత్త జీవం పోసింది సర్పంచ్‌లేనని, పల్లెల దశ, దిశ మార్చిన సర్పంచ్‌లకు సలాం చేస్తున్నానని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావు అన్నారు. సిరిసిల్లలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయ భవనంలో పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో సిరిసిల్ల నియోజవర్గ బీఆర్ఎస్ సర్పంచులకు ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచుల కుటుంబాలతో కలిసి భోజనం చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ఉద్యమ నినాదాలే కాదు మహాత్మాగాంధీ కలలను సాకారం చేసింది తెలంగాణ మాత్రమేనని అన్నారు. ఒకప్పుడు పల్లెలు అంటే పాత గోడలు, పాడుబడిన బావులు, చెత్తకుప్పలు, చెప్పలేనన్ని తిప్పలు ఉండేవని అన్నారు. దశాబ్దాలపాటు దగాపడ్డ తెలంగాణ దేశం ముందు కాలర్ ఎగరేసుకుని నిలిచిందన్నారు. సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడిన పల్లెలు, సకల సౌకర్యాల హరివిల్లుగా మార్చిన ఘనత మనదేనన్నారు. ఆదర్శ గ్రామాలకు అవార్డులకు తెలంగాణ పల్లెలు చిరునామాగా నిలిచాయన్నారు. మహాయజ్ఞంలో మనస్సు పెట్టి పనిచేసిన సర్పంచులు పల్లెల దశ, దిశ మార్చినందుకు హ్యాట్సాప్ తెలిపారు. గతంలో దేశంలోని ఇతర పార్టీల నాయకులకు తాను సవాల్ చేశానని ఏ రాష్ట్రానికైనా వస్తానని తెలంగాణలో ఉన్నట్లు నర్సరీలు, డంపింగ్ యార్డులు, అంతిమ సంస్కారం సంస్కారవంతంగా జరిగే విధంగా వైకుంఠధామాలు ఎక్కడా ఉన్నాయని అన్నారు. నూతన పంచాయతీ రాజ్ చట్టం ద్వారా 1858 గిరిజన అవసాసాలు గ్రామ పంచాయతీలుగా చేసుకున్నామని, 3146 మంది గిరిజన ఆదివాసీలను సర్పంచ్‌లుగా ఎన్నుకున్నామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ పంచాయతీలకు ప్రతి నెలా కేంద్ర నిధులతో సమానంగా రాష్ట్రం రూ 259 కోట్లు విడుదల చేసిందని అన్నారు. సమైక్య పాలనలో కంపు యార్డులే తప్ప డంపు యార్డులు లేవన్నారు. పల్లె ప్రజల భాగస్వామ్యంతో తీరు మారిన ప్రతీ ఊరు మెరుగైన జీవనానికి మారుపేరుగా ఉందన్నారు.

జిల్లాలో ప్రగతి ఫలాలు ఎన్నో

జిల్లాలో పల్లె ప్రగతి ఫలాలు ఎన్నో ఉన్నాయని మాజీ మంత్రి కేటీఆర్ వివరించారు. పల్లె ప్రగతి ముందు జిల్లాలో నాలుగు గ్రామాలకే ట్రాక్టర్లు ఉంటే ఇప్పుడు ప్రతీ గ్రామానికి ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు ఉన్నాయని, ఆరు గ్రామాల్లో రెండు చొప్పున ఉన్నాయన్నారు. గతంలో నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, కంపోస్ట్ షెడ్‌లు, వైకుంఠధామాలు లేవని ఇప్పుడు ప్రతీ గ్రామానికి ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ అవార్డులు 9 వచ్చాయని అన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సిరిసిల్లలో పరామర్శలు. ఆశీర్వాదాలు

సిరిసిల్ల పట్టణంలో బీఆర్ఎస్ నాయకుడు అగ్గిరాములు ఇటీవల గృహ ప్రవేశం చేయగా వారి ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపారు. గజభీంకార్ బాబు కూతురు, అల్లుళ్లను ఆశీర్వదించారు. గుండ్లపెల్లి రామానుజం, కుడిక్యాల రవిని పరామర్శించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



హాజరైన సర్పంచ్‌లు, వారి కుటుంబసభ్యులు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 16: సిరిసిల్లలో సంక్షోభంలో ఉన్న పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, మూత పడిన టెక్స్‌టైల్ పార్క్‌ను తెరిపించడంతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించి కార్మికులు, ఆసాములను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమరెడ్డి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వాహకంతో పీకలలోతు కష్టాల్లోకి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నెట్టివేయబడిందన్నారు. పది రోజుల కిందట గిట్టుబాటు ధరలేక టెక్స్‌టైల్ పార్క్‌లో వస్త్ర పరిశ్రమలను వ్యాపారులు పరిశ్రమలను బంద్ చేయడంతో తాజా సిరిసిల్ల పట్టణంలో పాలిస్టర్ వస్త్ర పరిశ్రమలను బట్టల ఉత్పత్తిని నిలిపివేసిందన్నారు. సిరిసిల్ల నేతన్నల కోసం బతుకమ్మ చీరల ఆర్డర్‌లు తీసుకొచ్చానని పదేపదే చెప్పుకుంటున్న మాజీ మంత్రి కేటీఆర్ నేతన్నలకు బతుకమ్మ చీరల బకాయిలను ఎందుకు ఇప్పించలేదో సమాధానం చెప్పాలన్నారు. రూ.240 కోట్లు బతుకమ్మచీరల బకాయిలు విడుదల చేయకపోవడంతో వస్త్ర వ్యాపారులు అప్పులపాలవుతున్నారన్నారు. అప్పులు తెచ్చి బతుకమ్మ చీరలను తయారు చేసినా ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా బకాయిలు విడుదల చేయడం లేదని, ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల పట్టణంలోని నేతన్నలను ఆదుకోవాలని బతుకమ్మ చీరలకురావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టెక్స్‌టైల్ పార్క్, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బంద్ చేయడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడతారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నేతన్నల గురించి ఆలోచించి మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలని లేకుంటే మళ్లీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వస్త్ర పరిశ్రమలను ఆదుకోవాలని కోరారు.

ఘనంగా మకరవిళక్కు పూజలు



ఆభరణాలను ఊరేగిస్తున్న స్వాములు

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మకరవిళక్కు పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అష్టాభిషేకం, పుష్పార్చన, శబరిమలలో నిర్వహించే సంప్రదాయ కార్యక్రమాలను చేపట్టారు. ఓరుగంటి నర్సింహారెడ్డి ఇంటి నుంచి మహిళల మంగళహారతులు, పుష్పఫలాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఆభరణాల సేవను కమనీయంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా ఆభరణాలను ఊరేగించారు. అయ్యప్ప మాలధారుల పేటతుళ్లి ఆటలు, గురుస్వామి శ్రీను చేతుల మీదుగా పడి పూజ, మకరజ్యోతి దర్శనం, హరిహరాసనాలను ఘనంగా నిర్వహించారు.



ఉత్సవమూర్తితో స్వాములు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పించండి

సిరిసిల్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పించాలని పలువురు మహిళలు సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌ను వేడుకున్నారు. మంగళవారం సిరిసిల్లకు వచ్చిన కేటీఆర్‌ను కలిసి డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం విన్నవించుకున్నారు. కేటీఆర్ స్పందిస్తూ 900 ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, అందిస్తామని హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, కోడం రమణ సిరిసిల్లలోని సమస్యలకు సంబంధించి వినతి పత్రం అందించారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై కేటీఆర్ దృష్టికి తీసుకవెళ్లగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్ బుధవారం సిరిసిల్లలో ఉండి సమస్యలను తెలుసుకొని చేనేత జౌళి శాఖ మంత్రి నాగేశ్వర్‌రావుతో కలిసి చర్చిస్తారన్నారు. సిరిసిల్లలోని వివిధ రంగాల కార్మికుల సమస్యలను కేటీఆర్‌కు వివరించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతారం చెరువులోకి నీటి విడుదల

ఇల్లంతకుంట, జనవరి 16: మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా అనంతారం చెరువులోకి ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి నీటిని విడుదల చేశారు. అనంతారం చెరువు నిండడంతో దిగువన ఉన్న 10 గ్రామాల రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లామని, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నీటిని విడుదల చేశామని తెలిపారు. మాజీ సర్పంచ్ వెంకటాచారి, నాయకులు ఎల్లంగౌడ్, కడగండ్ల తిరుపతి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల రాష్ట్ర పరిశీలకుడిగా పీడీ రవికుమార్

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల పరిశీలకుడిగా నియామకమయ్యారు. ఈ నెల 16 నుంచి 18 వరకు జనగామలో నిర్వహించనున్న అండర్- 14 బాలికల కబడ్డీ పోటీలకు పరిశీలకుడిగా నియమిస్తూ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. రవికుమార్ నియామకంపై స్థానిక పాఠశాలల హెచ్ఎంలు, పీడీలు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం కొనసాగుతోంది. మంగళవారం గ్రామంలోని ప్రధాన రోడ్లను శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి పర్శరాములు, అధ్యాపకులు విష్ణుప్రసాద్, సాగర్, పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఇల్లంతకుంట, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా మండలంలోని రేపాక, అనంతారం గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్ పోటీలు, పెద్దలింగాపూర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్, ఎంపీటీసీలు తీగల పుష్పలత, కథ సుమలత పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

ఇల్లంతకుంట, జనవరి 16:మండలంలోని పొత్తూర్‌లో సోమవారం ఇరుగ్రామాల యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం... పొత్తూర్‌కు చెందిన రాగటి బాబు, జేరిపోతుల హరీష్, గన్నేరువరం మండలం చొక్కరావుపల్లెకు చెందిన అజయ్, శివల మధ్య మద్యం వివాదం తలెత్తింది. దీంతో ఒకరిపై మరొకరు మద్యం బాటిళ్లు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. దాడుల్లో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

కన్నులపండువగా రామలింగేశ్వరుడి కల్యాణోత్సవాలు

- కొనసాగిన బండ్ల ప్రదక్షణ - ప్రత్యేక ఆకర్షణగా మేకపొట్టేళ్ల బండి
- భారీ భద్రతా ఏర్పాట్లు



కల్యాణం నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

ఇల్లంతకుంట, జనవరి 16: రామలింగేశ్వరుడి కల్యాణోత్సవాలు కలు కన్నులపండువగా సాగాయి. మండలంలోని జంగమరెడ్డిపల్లెలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా సోమవారం కల్యాణోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రెండో రోజైన మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వాహనాలలో వచ్చిన భక్తులు వాహనాలను ఆలయం చుట్టూ తిప్పడానికి పోటీపడ్డారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ కమిటీ చర్యలు తీసుకుంది. సీఐ సదన్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, శేఖర్‌రెడ్డి, అంజయ్య ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేశారు. ఉత్సవాలలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, సర్పంచ్ శ్రీలతనరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఎఫ్‌బీఐ అధ్యక్షుడు తూముకుంట రాజేందర్‌రెడ్డి, నాయకులు పసుల వెంకటి, బాలపోచయ్య, రమేష్, బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా మేకపొట్టేళ్ల బండి

రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలలో భాగంగా జరిగిన బండ్ల ప్రదక్షణలో మేకపొట్టేళ్ల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండలంలోని కేసన్నపల్లె గ్రామానికి చెందిన కురుమ కులస్థుల ఆధ్వర్యంలో ప్రతిసంవత్సరం బండ్ల ప్రదక్షణలో పాల్గొనడం ఆనవాయితీగా కొనసాగుతోంది.



ఆకట్టుకున్న మేక పొట్టేళ్ల బండి

రైలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, జనవరి 16: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం రైలు పట్టాలు దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని జనగాం రాజు(40) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాజు ఎడమ కాలు మోకాలు కింది వరకు తెగి వేరుగా పడింది. మరో కాలు పాదానికి గాయాలయ్యాయి. కరీంనగర్ 108 సిబ్బంది శంకరయ్య, సంపత్‌లు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడని, అతని ఎడమకాలు తొలగించారని కరీంనగర్ రైల్వే ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బావ్‌పేట్‌కు చెందిన జనగాం రాజు కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటున్నాడు.

33 ఏళ్లలో 84 దొంగతనాలు

● గోదావరిఖని పోలీసులకు చిక్కిన నిందితుడు

కోల్‌సిటీ, జనవరి 16: అంతర్ జిల్లా గజదొంగ షేక్ సలీం అలియాస్ ఉస్మాన్ అలియాస్ అస్లాం అలియాస్ జగన్(52)ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 25తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ప్రమోద్‌రావు పేర్కొ న్నారు. అంతర్ జిల్లాల్లో చోరీల్లో ఆరితేరిన సలీం దొంగతనాల చరిత్ర 33ఏళ్ల నుంచి కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలం గాణ జిల్లాలు ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అతడు చోరీలకు పాల్పడ్డాడు. పోలీస్ రికార్డుల్లోనే 84చోరీలపై కేసులు నమోదు అయ్యాయి. వరంగల్, చర్లపల్లి, చంచల్‌గూడ, నిజామా బాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జైళ్లలో సలీం అలియాస్ ఉస్మాన్ జైలు జీవితం గడిపాడు. ఇతనిపై గతంలో పీడీ యాక్టు నమోదు అయినా తీరు మార్చుకోలేదు. జైలులో పరిచయం అయిన నేరస్థులు ఒకరు కోల్ బెల్ట్‌లో సింగరేణి కార్మికులు సంక్రాంతికి స్వస్థలాలకు వెళతారని, ఏ ఇంట్లో చోరీ చేసినా గిట్టుబాటు అవుతుందంటూ సలీంకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడు గోదావరిఖనికి వచ్చి రెక్కీ చేసి గోదావరిఖనిలోకి మార్కండే యకాలనీ, ఎల్‌బీనగర్, రమేష్‌నగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలోలో చోరీలకు పాల్పడ్డాడు. నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు ఎత్తు కెళ్లాడు. సాంకేతిక ఆధారాలు, దొంగతనం చేసిన తీరు, పోలీసుల ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌తో చోరీలకు పాల్పడింది సలీం అలియాస్ ఉస్మాన్‌గా గుర్తించారు. అతడు జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండలం అమ్మక్కపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిని సోమవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడంలో కృషిచేసిన క్రైమ్ టీఎం ఎస్ఐ సమ్మయ్య, ఏఎస్ఐ మల్లయ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, వెంకటేష్‌ను సీఐ ప్రమోద్‌రావు అభినందించారు. అతని నేరాలపై మరింత దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ-2 ప్రసాద్‌రావు, ఎస్ఐ సమ్మయ్య పాల్గొన్నారు.

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి

● 15 ద్విచక్ర వాహనాలు, రూ. 8,500 స్వాధీనం



సాతారం శివారులోని కోళ్ల పందెం స్థావరం

మల్లాపూర్, జనవరి, 16 : మల్లాపూర్ మండలంలోని సాతారం గ్రామ శివారులో గల ఓ మామిడి తోటలోని కోడి పందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. గ్రామ శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో కోడి పందాలను నిర్వహిస్తున్నారని సమచారం మేరకు దాడులు చేయగా ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుం చి 8,500నగదు, ఆరు కోళ్ళు, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు కున్నట్లు ఆయన తెలిపారు.

అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందాడు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి ఖనికి చెందిన మహిపాల్‌రెడ్డి(45) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా హైదరా బాద్ నగరానికి వచ్చాడు. లింగంపల్లి చౌరస్తా వద్ద వైన్ షాపులో అతిగా మద్యం తాగి కాచిగూడ చప్పల్‌బజార్ ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఎదుట రోడ్డుపై పడిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకొని చనిపోయాడు. సానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

సైదాపూర్, జనవరి 16: సైదాపూర్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గాజుల లక్ష్మి(70) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి సోమవారం మధ్యాహ్నం తమ వ్యవసాయ బావి వద్దకు పని మీద వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దాంతో కుటంబ సభ్యులు గ్రామంతో పాటు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా దొరకలేదు. మంగళవారం ఉదయం తమ వ్యవసాయ బావి పక్కన గల రాము లపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మహేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద చెప్పులు కనిపించాయి. దాంతో గ్రామస్థుల సాయంతో ఆ బావిలో పాతాల గరిగె(అంకెన్లు)తో వెతుకగా లక్ష్మి మృతదేహం లభించింది. తన భార్య లక్ష్మి ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మృతి చెందిందని, మృతురాలి భర్త గాజుల మొగిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు.

ప్రమాదవశాత్తు అసిస్టెంట్ హెల్పర్ మృతి

కోనరావుపేట, జనవరి 16: ప్రమాదవశాత్తు బావిలో పడి సెస్ కార్యాలయంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్న శ్రీరాముల రాజేశం (55) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన శ్రీరాముల రాజేశం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సెస్‌లో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. 2011లో యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగ్గా ఉండదు. రోజూ కొలనూరు నుంచి వెళ్లి సిరిసిల్ల పట్టణంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో డ్యూటీకి వెళ్తున్నట్లు భార్యకు చెప్పి బయల్దేరాడు. కొలనూరు శివారులోని వ్యవసాయ బావి పక్క నుంచి వెళ్తుండగా రాజేశం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


రాజు (ఫైల్)

సిరిసిల్ల క్రైం, జనవరి 16: సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఓ దుకాణంలో బత్తుల రాజు (38) అనే యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ ఇన్‌చార్జి సీఐ సదన్‌కుమార్ వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలంలోని ఆవునూరు గ్రామానికి చెందిన రాజు సిరిసిల్లలో సెంట్రింగ్ వర్క్స్ దుకాణం ఏర్పాటు చేశాడు. భవనాలకు సెంట్రింగ్ కాంట్రాక్టు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో సంక్రాంతి పండుగరోజు సోమవారం ఇంటి నుంచి సిరిసిల్లకు వచ్చిన రాజు దుకాణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసు కున్న కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్లకు వచ్చి రాజుకు జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎల్లా రెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సెంట్రింగ్ పనుల్లో నష్టాలు రావడమే కాకుండా అప్పులు పెరిగి మనస్తాపం చెంది తన భర్త రాజు ఆత్మ హత్య చేసుకున్నట్లు అతడి భార్య సింధూర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో వలస కూలీ ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్, జనవరి 16: తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ పార్క్ ఇందిరిమ్మ కాలనీలో నివాసం ఉంటున్న వలస కూలీ చంద్రహాస్ (61) అనారోగ్యంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అజాంఘడ్ ప్రాంతంలోని లాల్‌గంజ్ జిల్లాలోని హరిష్‌పూర్ గ్రామానికి చెందిన అయన జీవనోపాధికోసం ఇక్కడికి వచ్చి ఇందిరమ్మకాలనీలో అద్దెకు ఉంటూ టెక్స్‌టైల్ పార్క్‌లో పని చేస్తున్నాడని తెలిపారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న అయన మంగళవారం అద్దెకు ఉంటున్న ఇంటోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసున్నాడని ఇంటి యాజమాని కందికొప్పుల స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

భూ తగాదాలో ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

● సోషల్ మీడియాలో పోస్టులు ● ఇద్దరిపై కేసు

పెగడపల్లి, జనవరి 16: పెగడపల్లి మండలం దోమలకుంటలో భూతగాదా విషయంలో ఇద్దరు రైతులు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒకరి తరువాత ఒకరు పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియోలు తీసుకోవడంతో పాటు వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెగడపల్లి ఎస్.ఐ సీహెచ్.సతీష్ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతుండగా ఇద్దరు జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన తొట్ల శేఖర్‌కు విక్రయించాడు. దీనికి సంబంధించి 31 గుంటల భూమి పట్టా కాగా మిగతాది పెండింగ్‌లో ఉంది. ఇలా కొద్ది రోజులు గడవగా తిరిగి తన భూమి తనకు కావాలని శ్రీనివాస్ శేఖర్‌ను కోరాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ చేసుకుని భూమి తిరిగి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గడువు సమయంలో భూమికి సంబంధించిన డబ్బుల చెల్లింపుల విషయంలో గొడవలు తలెత్తగా సోమవారం ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ పురుగుల మందు తాగారు. స్థానికులు ఇద్దరినీ జగిత్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. శ్రీనివాస్, శేఖర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సతీష్ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురి అరెస్ట్

జగిత్యాలరూరల్/రాయికల్ జనవరి 16: రాయికల్ మండలం భూపతిపూర్ శివారులో మంగళవారం గంజాయి రవాణా చేస్తున్న భూపతిపూర్ గ్రామానికి చెందిన ఎండీ దిల్షాద్, కడార్ల మహేష్, పెద్దిరెడ్డిజయంత్, దొనిపాల సాయిభరద్వాజ్ తోపాటు ఒక మైనర్ ఐదుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ ఆలీఖాన్ తెలిపారు. జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో మంగళ వారం విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం రాయికల్ ఎస్సై అజయ్ తన సిబ్బందితో కలిసి భూపతిరోడ్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా ఐదుగురు అనుమానాస్పదంగా కలిపించారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద నుంచి 4.03 కిలోల విలువ గల గంజాయి, రూ లక్ష 750 రూపాయలతో పాటుగా ఐదుసెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై అజయ్, కానిస్టేబుల్స్ సాగర్, సంతోష్, ప్రశాంత్ లను సీఐ అభినందించారు.

అంగారిక టౌన్ షిప్‌లో చోరీ

- 55చదరపు మీటర్ల అల్యూమినియం కండక్టర్ల అపహరణ

తిమ్మాపూర్, జనవరి16: మండలంలోని రామకృష్ణ కాలనీ అంగారిక టౌన్ షిప్‌లో విద్యుత్ స్తంభాలపై ఉన్న వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎల్ఎండి ఎస్సై చేరాలు, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఏఈ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అంగారిక టౌన్ షిప్‌లో నూతనంగా విద్యుత్ లైన్లు వేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా వరుసగా సెలవులు రావడంతో పనుల్లో అంతరాయం ఏర్పడింది. ఇదే అదునుగా దొంగలు చోరీకి పాల్పడి 20విద్యుత్ స్తంభాలపై ఉన్న సుమారు 55 చదరపు మీటర్లు(సుమారు450కిలోల) అల్యూమినియం కండక్టర్ల(వైరు) కట్ చేసుకొని ఎత్తుకెళ్లారు. దాని విలువ సుమారు 3లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యుత్ ఏఈ శ్రీధర్ ఎల్ఎండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.

కోర మీసాల స్వామికి కోటి మొక్కులు

● భక్తజన జాతరగా మారిన కొత్తకొండ ● మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది. ఎటు చూసినా క్యూ లైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుని నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపొయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కుమార్, వరంగల్ జిల్లా అధికారులు, ప్రజాప్రతనిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్ రావులు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగాం, నల్గొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు.


దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు, స్వామివారు




మొక్కులు చెల్లించేందుకు వస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

రాష్ట్ర వ్యాప్త గుర్తింపుగా కొత్తకొండ జాతర

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్ర వ్యాప్త గుర్తింపుగా కొత్తకొండ జాతరను నిర్వహిద్దామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం కొత్తకొండ జాతరలో స్వామివారికి గుమ్మడికాయ, కోరమీసాలు చెల్లించి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి కొత్తకొండకు భక్తులు వచ్చే విధంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కొత్తకొండ వీరన్నకు కోరమీసాలు సమర్పిస్తే కోరిన కోరికలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నానన్నారు.

● కొత్తకొండ జాతరలో వృక్ష ప్రసాదాన్ని మాజీ మంత్రి ఈటల రాజేందర్ వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. గత ఏడు సంవత్సరాలుగా కొత్తకొండ జాతరలో జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి మొక్కలు పంపిణీ చేస్తున్నారు.


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం


మేకల రథం


వృక్ష ప్రసాదం పంపిణీ చేస్తున్న ఈటల రాజేందర్

పీవీ ఇంటి నుంచి జాతరకు రథం

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కుటుంబీకులు గత 9 దశాబ్దాలుగా కొత్తకొండ శ్రీవీరభద్రస్వామికి ఎడ్ల బండి రథం తిరిగే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. పీవీ తనయుడు పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ మదన్‌మోహన్ రావులు సోమవారం ఎడ్లబండి రథాన్ని ప్రారంభించారు. రథాన్ని అందంగా తయారు చేశారు. పీవీ నర్సింహారావు, పీవీ రాజేశ్వర్‌రావులు గతంలో రథం తమ ఇంటి నుంచి నడపడం ఆనవాయితీ. పీవీ చిన్న కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు ఈ ఆనవాయితీ కొనసాగించారు.

సంక్రాంతి పర్వదినాన వేములవాడకు పోటెత్తిన భక్తులు


వేములవాడలో భక్తుల రద్దీ


బద్దిపోచమ్మ ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

వేములవాడ, జనవరి 16 : సంక్రాంతి పర్వదినాన వేములవాడ పుణ్యక్షేత్రం భక్తజనంతో జాతరను తలపించింది. సోమవారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు గత కొద్ది వారాలుగా వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ సోమవారం కలిసి రావడంతో సుమారు 50 వేల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి రాజన్న దర్శనం కోసం తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా ముందుగా ప్రకటించిన విధంగా గర్భాలయంలో రుద్రాభిషేకం, అన్నపూజ తదితర ఆర్థిక సేవలను నిలిపివేసి శీఘ్రదర్శనం అమలు చేశారు. అయినప్పటికీ శ్రీ స్వామివారి సర్వ దర్శనం కోసం సుమారు మూడు గంటల సమయం, శీఘ్రదర్శనంకు సుమారు గంటకు పైగా సమయం పట్టింది. మేడారం వెళ్లడానికి ముందు భక్తులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకునే ఆనవాయితీ ఉండడంతో కోడె మొక్కుల క్యూ లైన్‌లో భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరారు. ఆలయం నుండి గుడి చెరువు పార్కింగ్ స్థలం వరకు క్యూలైన్లో భక్తులు నిండిపోయారు. దీంతో కోడెమొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుండి ఐదు గంటలకు పైగా సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వీఐపీల సిఫారసు లేఖలతో వచ్చిన వారు భక్తుల సమాచార కేంద్రం వద్ద చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా సోమవారం సుమారు 50 వేల మంది భక్తులు శ్రీ స్వామివారి దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో ఏఈఓ బి.శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతి రావు, అల్లి శంకర్, ప్రోటోకాల్ విభాగం పర్య వేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, పరిశీలకులు అశోక్, పవన్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం నాడు తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయంలో నేడు అభిషేక పూజలు రద్దు

వేములవాడ, జనవరి 16: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో 17వ తేదీ బుధవారం గర్భాలయంలో అభిషేక పూజలు రద్దు చేసినట్లు ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో పాటు బుధవారం ఆలయ హుండీ లెక్కింపు చేపట్టనున్న కారణంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తులకు గర్భాలయ ప్రవేశం నిలిపివేశామని, అన్నపూజ టిక్కెట్లను మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల నుంచి జారీ చేస్తామని ఆయన వివరించారు.

రేపు మినీ జాబ్‌మేళా

గణేశ్‌నగర్, జనవరి16: ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు గురువారం ఉదయం 10గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, కరీంనగర్ నందు మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే.దేవేందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పనిచేయుటకు పేటీఎంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, పోస్టుల కోసం విద్యార్హత ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, పూర్తిచేసి ఉండాలన్నారు. 18-35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. వేతనం 15,500 నుంచి 21,000 రూపాయలు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9989152622,9849331903నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

కరీంనగర్ క్రైం, జనవరి 16: కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగిందని స్థానికులు తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక ఇన్వర్టర్, ప్రాథమిక పాఠశాలలో గ్యాస్ సిలిండర్, ఒక సీలింగ్ ఫ్యాన్ ఎత్తుకుపోయారని తెలిపారు.


కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు

మల్యాల, జనవరి 16: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో వేలాదిగా కొండపైకి భక్తులు తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్ రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం రద్దీగా మారింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

గాలిపటం ఎగురవేస్తుండగా ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

● విద్యుదాఘాతంతో ఒకరు.. భవనం పైనుంచి పడి మరొకరు

కోరుట్ల, జనవరి 16: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో సోమవారం గాలిపటం ఎగరవేస్తుండగా ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని భీముని దుబ్బ ప్రాంతంలో నివాసం ఉంటున్న పూర్ణ దుర్గాప్రసాద్ కుమారుడు ప్రశాంత్ 7వ తరగతి చదువుతున్నాడు. మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన తోకల కిష్టయ్య - నర్సు దంపతుల కుమారుడు సాత్విక్ పట్టణంలోని అమ్మమ్మ జుండర్తి సాంబయ్య - ఎల్లయ్య ఇంట్లో ఉండి ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సందర్భంగా సెలవులు రావడంతో సాత్విక్, ప్రశాంత్ ఇద్దరు కలిసి కాలనీలో ఉన్న ఖాళీ ప్రదేశంలో గాలిపటం ఎగురవేయడానికి వెళ్లారు. గాలిపటం ఎగుర వేస్తుండగా విద్యుత్ వైర్లకు తగిలి వేలాడుతుండటంతో సాత్విక్, ప్రశాంత్‌లు గాలిపటం తీయడానికి అక్కడే ఉన్న ఓ భవనం పైకి ఎక్కి తీసే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతంతో సాత్విక్ తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లి పడిపోయాడు. సాత్విక్ పరిస్థితి చూసి భయపడిన ప్రశాంత్ భవనం నుంచి పరుగు తీసే ప్రయత్నంలో భవనం నుంచి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కాలనీ వాసులు ఇద్దరినీ హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇద్దరిని ఉన్నత చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంఘటన స్థలంను విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ పరిశీలించారు. పట్టణం శివారులోని 133 కేవీ లైన్ నుంచి కల్లూర్ రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కొరకు ఏర్పాటు చేసిన లైన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగినట్లు ఎస్ఈ తెలిపారు. ఇండ్ల సముదాయాల నుండి సరఫరాను మార్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

చెక్‌డ్యాం కూల్చే యత్నం.. అడ్డుకున్న స్థానికులు

పెద్దపల్లి రూరల్, జనవరి 16: మండంలోని హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్ డ్యాంను కూల్చి వేసేందుకు కొంతమంది దుండగులు ప్రత్నించారు. అక్కడి స్థానికులు, రైతులు అడ్డుకోవడంతో సంఘటన స్థలం నుంచి జారుకున్నారు. పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట, కొత్తపల్లి, మూలసాల గ్రామాలను ఆనుకుని ఉన్న హుస్సేన్‌మియా వాగులో సుమారు ఆరేళ్ల క్రితం వంద ఎకరాల పంటలను సాగు చేసుకునేందుకు సుమారు మూడు కోట్ల వ్యయంతో చెక్ డ్యాంను నిర్మించారు. నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు కింది గ్రామాల రైతులకు సాగు నీరు అందుతోంది. అయితే సోమవారం కొంతమంది చెక్‌డ్యాంను కూల్చేందుకు ట్రాక్టర్ సహాయంతో డిటోనేటర్, జిలెటిన్ స్టిక్స్, డ్రిల్ మిషన్‌తో రాగా స్థానికులు గుర్తించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొనేసరికి దుండగులు అక్కడి నుంచి జారుకున్నారు. సంఘటన స్థలం వద్ద చెక్ డ్యాంను కూల్చేందుకు తీసుకొచ్చిన ఒక డ్రిల్లింగ్ మిషన్, 8 డిటోనేటర్లు, 11 జిలెటిన్ స్టిక్స్ లభించాయి. దీంతో రైతులు పోలీసులకు సమాచారం అందించారు. చెక్ డ్యాంను బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, నాయకుడు పల్లె సదానందం, బీఆర్ఎస్ నాయకుడు బాలసాని ఈశ్వర్ గౌడ్ చెక్‌డ్యాంను పరిశీలించారు. ఘటనపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈఈ బుర్ర రాజ్యలక్ష్మీ పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మందుగుండు సామగ్రి లభ్యం..

చెక్ డ్యాంను కూల్చేందుకు వచ్చిన దుండగులు తీసుకొచ్చిన మందుగుండు సామగ్రిని రైతులు పోలీసులకు అప్పగించారు. చెక్ డ్యాంను కూల్చడానికి తీసుకువచ్చిన డ్రిల్ మిషన్, ఎనిమిది డిటోనేటర్లు, 11 జిలెటిన్ స్టిక్స్ లభించాయి. వాటిని పెద్దపల్లి పోలీసులకు అప్పగించారు. సాగు నీరు అందకపోతే అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలి కాని కూల్చే ప్రక్రియ చాలా దారుణమైందని పేర్కొంటున్నారు.


చెక్ డ్యాం కూల్చివేతకు తీసుకొచ్చిన సామగ్రి

లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న కేటీఆర్

సిరిసిల్ల రూరల్ జనవరి 16: తంగళ్లపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం రాత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఎంపీపీ పడిన మానసరాజు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గజసింగవరంలో వాలీబాల్, కబడ్డీ పోటీలు



గజసింగవరంలో గెలుపొందిన క్రీడాకారులు

గంభీరావుపేట, జనవరి 16 : సంక్రాంతి పండగ సందర్భంగా గంభీరావు పేట మండలం గజసింగవరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుతారి బాలరాజు, ఉప సర్పంచ్ చెన్నాల దేవరెడ్డి, గ్రామ పెద్దలు బెజిగం లింగారెడ్డి, చంద్రమౌళి, లక్ష్మీనర్సయ్య, యూత్ నాయకులు భాస్కర్, శిరీష్, మహేష్, సతీష్, వేణు తదితరులు ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

సిరిసిల్ల టౌన్, జనవరి 16 : మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సదస్సు కరపత్రాన్ని యూనియన్ జిల్లా నాయకులు, కార్మికులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడారు. జిల్లా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న సిరిసిల్ల పట్టణం పద్మశాలి కల్యాణ భవనంలో యూనియన్ జిల్లా జనరల్ బాడీ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రేం పావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉపాధ్యక్షుడు తోపునూరి చక్రపాణి, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని వివరించారు. జిల్లాలోని యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్‌గా చీటి జితేందర్‌రావు

ముస్తాబాద్, జనవరి 16 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని హరిహర పుత్ర ఆలయ కమిటీ చైర్మన్‌గా చీటి జితేందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు శాంతి స్వరూపులు రాజుగురు స్వామి ఆధ్వర్యంలో రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జితేందర్‌రావు ఎంపీపీ జనగామ శరత్‌రావు తదితరులు అభినందించారు.

● ఆలయ కమిటీ అధ్యక్షుడు చీటి జితేందర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ మండల అధ్యక్షుడిగా నియామకమైన మెర్గు అంజాగౌడ్‌ను సన్మానించారు.

విద్యుత్ మోటారు తీగల చోరీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు వార్డుల్లో తాగు నీటి ట్యాంకుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లతోపాటు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల విద్యుత్ తీగలు మంగళవారం చోరీకి గురయ్యాయి. తీగలను కోసి ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి దేవరాజు పరిశీలించారు. జీపీకి చెందిన విద్యుత్ తీగ దొంగతనంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని కార్యదర్శి దేవరాజు పేర్కొన్నారు. తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా విద్యుత్ తీగలను బిగించామని తెలిపారు. ఇటీవల వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు, విద్యుత్ తీగలను దొంగలు ఎత్తుకెళుతున్నారని రైతులు వాపోతున్నారు. పోలీసులు రాత్రి వేళలో గస్తీ పెంచాలని, చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

బండలింగంపల్లిలో సైరన్ వాహనంతో హంగామా

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఓ యువకుడు సైరన్ ఉన్న కారుతో హంగామా సృష్టించాడని స్థానికులు తెలిపారు. గ్రామంతో పాటు శివారు ప్రాంతాల్లో సైరన్ వేసుకుని తిరుగడంతో పోలీసులు వచ్చారని భావిస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురు భయంతో పరుగులు తీశారు. దీంతో గ్రామంలోని రాజయ్యతోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. సైరన్ ఉన్న కారు అతి వేగంగా దూసుకెళ్లడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఓ యువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు చిట్‌ఫండ్‌లో విధులు నిర్వహిస్తాడని, సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వచ్చాడని తెలిసింది. యువకుడి బావ కరీంనగర్‌లో కార్పొరేటర్ కావడంతో అయనకు చెందిన కారుతో గ్రామానికి చేరుకొని సైరన్ వేసి సంచరించినట్లు పోలీసులు గుర్తించారని సమాచారం.

రహదారి పక్కకు దూసుకెళ్లిన కారు

మల్యాల, జనవరి 16: మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఓ కారు అదుపు తప్పి రహ దారి పక్కకు దూసుకెళ్లింది. మంగళవారం వేకువజామున చోటు చేసుకున్న ఈ సంఘటనలో దూసుకెళ్లిర కారు చెట్టుకు ఢీకొట్టడంతో ముందు భాగం ధ్వంసం అయింది. అయితే ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని వారంత వెళ్లి పోయినట్లు స్థానికులు తెలిపారు.

ఇంటింటా సంక్రాంతి సంబరాలు



సిరిసిల్లలో ఆకట్టుకున్న రామమందిరం ముగ్గు

- ముచ్చట గొలిపిన. మూడు రోజుల పండుగ
- ఆకట్టుకున్న రంగవల్లులు
- బసవన్న విన్యాసాలు - నోరూరించిన పిండి వంటలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సంక్రాంతి మూడు రోజుల విశిష్టమైన పండుగ భోగి, మకర సంక్రాంతి, మంగళవారం కనుమతో జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు శోభనిచ్చాయి. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో రామమందిరం ముగ్గులు ఆకట్టుకున్నాయి. గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పిండి వంటల ఘుమఘుమలు నోరూరించాయి. పతంగులతో చిన్నాపెద్దా సందడి చేశారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, బోయిన్‌పల్లి, ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు కాలనీల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, బండలింగంపల్లి, సింగారం, కోరుట్లపేట, బొప్పాపూర్, గొల్లపల్లి, రాజన్నపేట, అల్మాస్‌పూర్, దుమాల, అక్కపల్లి, తిమ్మాపూర్, వెంకటాపూర్, పదిర, హరిదాస్ నగర్, తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ గ్రామాల్లోని యువజన సంఘాల ఆధ్వర్యంలో ముగ్గులు, క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. యువతులు, మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, తహసీల్దార్ రాంచందర్, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వేములవాడ: సంక్రాంతి పర్వదినాన్ని సోమవారం వేములవాడలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మహిళలు, యువతులు, చిన్నారులు తెల్లవారుజామునే ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులతో అలంకరించారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పెద్ద సంఖ్యలో స్థానికులు రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

రుద్రంగి: రుద్రంగి మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వాకిళ్లు రంగురంగుల ముగ్గులతో మెరిసిపోయాయి. ఆకాశవీధిలో యువకుల గాలిపటాలు విహరించాయి. సంప్రదాయాలకు అద్దంపట్టేలా సకుటుంబ సపరివార సమేతంగా సంక్రాంతి పండుగను జరుపుకున్నారు.



ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న ఎంపీపీ

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



మల్యాలలో మాట్లాడుతున్న కేటీఆర్

చందుర్తి, జనవరి 16 : క్రీడల మాదిరిగానే రాజకీయాల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించే సత్తా ఉండాలని, జీవితంలో రాజకీయంలో ఎదురుదెబ్బలు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. చందుర్తి మండలం మల్యాలలో కేసీఆర్ కప్ వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో, రాజకీయంలో ఎదురుదెబ్బలు సహజమని గోడకు తగిలిన రబ్బర్ అదే తరహాలో మళ్లీ తప్పకుండా తిరిగి అధికారంలోకి వస్తామని అన్నారు. క్రీడాకారుల్లో చాలామంది మట్టిలో మాణిక్యాలు ఉన్నారని, వారిని సానబట్టి బయటకు తీసేందుకు కృషి చేస్తానని అన్నారు. మంచి స్ఫూర్తితో క్రీడలలో సత్తా చాటాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మాజీ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ క్రీడలతో ఆసక్తి పెంపొందించుకోవాలని, తన దృష్టికి తీసుకువచ్చిన తరుణంలోనే అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. ఇందులో భాగమే గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నాటి తెలంగాణకు నేటి తెలంగాణకు ఎంతో తేడా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలు కూడా ఆర్థికంగా ముందు వెళ్తున్న క్రమంలో యువత కూడా వెళ్లాలని కోరుకున్నామన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అరుణ మాట్లాడుతూ ఆటలు శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ బైరగోని లావణ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ, సీఎం కేసీఆర్ కప్ నిర్వాహకులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈర్లపల్లి రాజు, నాయకులు మ్యాకల ఎల్లయ్య, దుమ్మ అంజయ్య పోతరాజు నగేష్, యాచమనేని శ్రీనివాసరావు, సంటి బాబురావు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

చందుర్తి, జనవరి 16 : చందుర్తి మండలం నర్సింగాపూర్ శివారులో వెలిసిన మోహినికుంట మల్లికార్జున స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, భక్తులు మంగళవారం భూమి పూజ చేశారు. వేముల వాడకు చెందిన దర్ర మల్లేశం, గొల్లపల్లి గ్రామానికి చెందిన బొల్లు శ్రీనివాస్ అనే దాతలు ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపెల్లి గంగాధర్, ఉప సర్పంచ్ కాసారపు శ్రీనివాస్, ఆలయ చైర్మన్ నక్క. గంగాధర్, వార్డు సభ్యులు ఇల్లంతకుంట గణేష్, చింతకుంట బాపయ్య, మేర్గు మల్లేశం పాల్గొన్నారు.

పల్లెల్లో కాట్రేవుల పండుగ



మొక్కులు చెల్లిస్తున్న ప్రజాప్రతినిధులు, రైతులు

కోనరావుపేట, జనవరి 16 : సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని కనగర్తి గ్రామంలో రైతులు సోమవారం కాటమరాయుని పండుగ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మైసమ్మ తల్లి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగకు పాడి పశువులు బాగుండాలని కోరుతూ పశువులకు స్నానాలు చేయించి ఊరేగింపుగా తీసుకెళ్లి మైసమ్మ తల్లి వద్ద మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా నైవేద్యం చెల్లించి బాగుండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనుపాటి భారతి బాపురెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారం అందిస్తాం



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

వేములవాడ, జనవరి 16 : జిల్లా వీర శైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మంగళ వారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వీర శైవ జంగమ అర్చకులకు ప్రభుత్వ పరంగా పూర్తిగా సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జంగమ సమాజం అధ్యక్షుడు రవికుమార్, గణాచారి మఠం సాంబశివుడు, గుంటి మఠం జగదీశ్వర్, మఠం మృత్యుంజయం, కార్యవర్గ సభ్యులు రాజమౌళి, సంపత్, పత్రి మల్లేశం, ఎనుగంటి నాగేంద్ర, గొంగళ్ల మల్లేశం, గొంగళ్ల నాగరాజు, మహేశ్వర్, సంతోష్, గొంగళ్ల రాజశేఖర్, నాగరాజు, దేవేందర్, వెన్నెల బాలచందర్, ఎనుగంటి శంకర్, ఎనుగంటి ప్రసాద్, ధూపం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

గంభీరావుపేట, జనవరి 16 : గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో చంద్రాగౌడ్ అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి మంగళవారం చంద్రాగౌడ్ కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. సమాజ సేవలో భాగస్వాములుకావాలన్నారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కాస శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు పండగ నరేష్, ఉపాధ్యక్షుడు అంబటి నాగార్జున, ప్రధాన కార్యదర్శి అంబటి సురేష్, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు షేక్ తాజొద్దీన్, కొత్తపల్లి చంద్రం, గంగి స్వామి, జోగు సురేష్, సుద్దాల దేవయ్య, హరీష్, అక్కుల స్వామి, మధు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ముస్తాబాద్, జనవరి 16 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సారుగు విజయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పోచమ్మ యూత్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని మంగళవారం అందజేశారు. కుటుంబానికి అండగా నిలబడుతామని సభ్యులు పేర్కొన్నారు.

బంద్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి పంతం రవి

సిరిసిల్ల టౌన్, జనవరి 16 : పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ బంద్ నిర్ణయాన్ని వ్యాపారులు వెంటనే ఉపసంహరించుకోవాలని లాల్ బాహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో ఏఐటీయూసీ, లాల్ బాహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంతం రవి మాట్లాడుతూ పాలిస్టర్ వస్త్ర వ్యాపారులు ఏక పక్షంగా పాలిస్టర్ పరిశ్రమను బంద్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆసాములను, కార్మికులను అడ్డుపెట్టుకొని పాలిస్టర్ వస్త్ర వ్యాపారులు సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ నాయకులకు కమీషన్లను ఇస్తూ కోట్లాది రూపాయాలు సంపాదించుకున్నారన్నారు. ప్రస్తుతం అలా సంపాందించుకోవడానికి వీలు కాదని ఇపుడు పాలిస్టర్ వస్త్ర పరిశ్రం సమ్మె డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వంను వ్యాపారులు తమ చెప్పు చేతుల్లో ఉంచుకోవడం కోసం బంద్ పెట్టారని అన్నారు. పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ బంద్‌ను వెంటనే వ్యాపారులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అధికారులను అడ్డు పెట్టుకొని ఎస్ఎస్ఐ యూనిట్లు, మ్యాక్స్ సంఘాలలో అనేక అవకతవకలు జరగాయని ఆరోపించారు. పవర్‌లూమ్స్ లేని యజమానుల పేరిట ఎస్ఎస్ఐ సంఘాలను ఏర్పాటు చేయడం సిగ్గు చేటన్నారు. మాక్స్ సంఘాల అధ్యక్షకార్యదర్శులకు మరమగ్గాలు లేకున్న కమిషన్‌ను దండుకుంటున్నారని ఈ విషయాలపై నూతన ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రక్షాళన చేసిన తరువాతే ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. మాజీ మంత్రి, ప్రస్తుత సిరిసిల్ల ఎమ్మెల్యే పవర్‌లూం పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలనడం సిగ్గుచేటన్నారు. సిరిసిల్లలో పవర్‌లూం పరిశ్రమను భ్రష్టు పట్టించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని పవర్‌లూమ్స్‌పై విద్యుత్ సబ్సిడీని తొలగించే ప్రయత్నం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలకు రావల్సిన సుమారు రూ. 260 కోట్లు విడదల చేయకుండా పెండింగ్‌లో పెట్టి ప్రస్తుత సంక్షోభానికి కారణమైందని పాలిస్టర్ పరిశ్రమ వ్యాపారులు, ఆసాములు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు. సిరిసిల్లకు కన్నతల్లి లాంటి కాటన్, పాలిస్టర్ పరిశ్రమను నిరంతరం కొనసాగిస్తూ కార్మికులకు ఉపాధి పొందే విధంగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, నాయకులు నల్ల చంద్రమౌళి, అన్నల్‌దాసు గణేష్ పాల్గొన్నారు.

బోరబండలో సిరిసిల్ల యువకుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, జనవరి 16: సిరిసిల్ల పట్టణానికి చెందిన సమీర్ (27) అనే యువకుడి హైదరాబాద్‌లోని బోరబండలో ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి అతను ఉంటున్న గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఆర్థిక ఇబ్బందులతో సమీర్ ఆత్మహత్యకు ఒడిగట్టినట్లు అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటనపై సిరిసిల్లలో ఉంటున్న అతని బంధువులకు సమాచారం అందించి బోరబండ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు జీవనోపాధికై వెళ్లినట్లు తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సి ఉంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముస్తాబాద్,జనవరి 16 : మండలంలోని గన్నేవానిపల్లె గ్రామానికి చెందిన కోదాటి దేవయ్య అనారోగ్యంతో మరణించగా బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంగళవారం పరామర్శించారు. రూ 5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. 1997-98లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు దేవయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రూ.27 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఆహ్లాదం ఆమడ దూరం

- ముళ్ల చెట్లతో నిండిన చెరువు కట్ట - పట్టించుకోని అధికారులు



కట్టకు ఓ వైపున ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చి ప్రజలకు ఆహ్లాదం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులను కేటాయించింది. చెరువు కట్ట సుందరీకరణ పనులను చేపట్టింది. కట్ట బలోపేతం, రోడ్డు నిర్మాణం, నడక దారి, విద్యుత్ దీపాల ఏర్పాటు, కూర్చునేందుకు బల్లలు, మొక్కల పెంపకం వంటి పనులకు శ్రీకారం చుట్టింది. కాంట్రాక్టర్ నామమాత్రపు పనులు చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కట్ట పొడవునా ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. విద్యుత్ దీపాలు వెలగడం లేదు. నాటిన మొక్కలు ఎండిపోతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

సిరిసిల్ల టౌన్, జనవరి 16: తెలుగు ప్రజలు ఏటా జరుపుకునే సంక్రాంతి పర్వదినం రోజులలో ఆడపడుచులు ఇంటి ముందు వేసే రంగురంగుల ముగ్గులు కొత్త వెలుగులు తీసుకొస్తాయని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం 3వ వార్డు విద్యానగర్‌లో శ్రీఅభయాంజనేయ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పోటీలో పాల్గొని సంక్రాంతి ప్రాముఖ్యతను చాటుతూ వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకన్నాయి. ముగ్గుల పోటీలలో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన మున్సిపల్ చైర్ పర్సన్ కళా చక్రపాణి, ప్రముఖ వైద్యురాలు శోభరాణి, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయిని అంజలిదేవి మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. విజేతలను ఎంపిక చేశారు. అనంతరం విద్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో చైర్ పర్సన్ కళాచక్రపాణి, వైద్యురాలు శోభరాణి మాట్లాడారు. సంక్రాంతి రైతులకు, మహిళలకు ఎంతో ఇష్టమైన పండగన్నారు. అభయాంజనేయ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రేపటి తరానికి సంక్రాంతితోపాటు ముగ్గుల గొప్పతనాన్ని తెలయజేయడం అభినందనీయమన్నారు. అనంతరం ముఖ్య అతిథులు చింతకింది లావణ్య శ్యాం ప్రథమ బహుమతి, బొల్లి నిఖితరామ్మోహన్ ద్వితీయ బహుమతి, గడ్డం శరణ్యఅరవింద్ తృతీయ బహుమతి, రెండు కన్సలేషన్స్ బహుమతులు చేరాల లావాణ్యప్రసాద్, ఎల్లగొండ నవ్యశ్రీచంద్రశేఖర్‌కు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులను సొసైటీ మహిళలు సన్మానించారు. శ్రీఅభయాంజనేయ సొసైటీ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి పన్యాల యెల్లారెడ్డి, సహాయ కార్యదర్శి చేరాల ప్రసాద్, కోశాధికారి ఎల్లగొండ చంద్రశేఖర్, సాంస్కృతిక కార్యదర్శి బుస్స రాజేందర్, సభ్యులు కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, వెల్మల తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంకుమార్, శంకర్, ధర్మారెడ్డి తిరుపతిరెడ్డి, రత్నాకర్, నర్సయ్య, రవి, కుమారస్వామి, రవీందర్, సతీష్, దేవేందర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి అందజేస్తున్న అతిథులు



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో సంక్రాంతి పండగ సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహించారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులను వేశారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాశెట్టి భాస్కర్, సిరికొండ శ్రీనివాస్, తోట నాగరాజు, తోట మల్లేశం, తోట శ్రీనివాస్, కత్తి రమేష్, అవిర్నేని సతీష్, బట్టు నర్సయ్య, సిర్రం మల్లేశం, ఆడేపు పవన్, మటకం మల్లేశం, గోపాల స్వామి, రజిత, జ్యోతి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.